ప్రజాశక్తి
ఆదివారం 05 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి

అనంతపురంలో ఆటో డ్రైవర్ల సేవలో మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఆటోడ్రైవర్లకు ప్రభుత్వ సాయం

◆ జిల్లా వ్యాప్తంగా పథకం ప్రారంభం కార్యక్రమాలు
◆ పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేరకు ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ సాయం అందించారు. ఆటో డ్రైవర్ల సేవలో పేరుతో ఈ పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఒక్కో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేలను వారి ఖాతాల్లో జమ చేశారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా నియోజకవర్గం ఎమ్మెల్యేలు, అధికారులు స్వయంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఆటో డ్రైవర్లకు మెగా చెక్కులను అందించారు. ఎమ్మెల్యేలు ఖాకీ దుస్తులు ధరించి ఆటోలు నడిపారు. పుట్టపర్తిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. పుట్టపర్తిలో ఆటో డ్రైవర్లు భారీ ప్రదర్శన చేపట్టారు. ఆటోలో కలెక్టర్, ఎమ్మెల్యే, మాజీమంత్రి కొంత దూరం ప్రయాణించారు. సాయి ఆరామం అతిథి గృహం వరకు ఆటోల ప్రదర్శన కొనసాగింది. అక్కడ జిల్లా రవాణా శాఖ అధికారి కరుణ సాగర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ ఎవరికైనా చలానా కట్టే సమస్యలుంటే అలాంటి ఆటో డ్రైవర్లు అందరికీ తానే చలానాలు చెల్లిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి శాఖ డైరెక్టర్ పత్రి చంద్రశేఖర్, కొత్తచెరువు మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, టిడిపి నాయకులు శ్రీరామ్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సామ కోటి ఆదినారాయణ, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మడకశిరలో ప్రదర్శన చేస్తున్న ఆటోడ్రైవర్లు

కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకిద్దాం

◆ ట్రంప్‌నకు తలొగ్గిన ప్రధాని మోడీ
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ

ప్రజాశక్తి-పెనుకొండ

దేశ ఉత్పత్తులు, ఇతర వాటిపై అమెరికా అధ్యక్షుడు ఎడాపెడా పన్నుల భారం మోపుతూ వ్యవహరిస్తున్న ఆయన ఆధిపత్య ధోరణిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ట్రంప్ అడుగులకు మాడుగులొత్తే మోడీ లొంగుబాటు విధానం దేశానికి అత్యంత ప్రమాదకరం అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 ఏప్రిల్ నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారత దేశంతో సహా ప్రపంచ దేశాలన్నింటి పైనా తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆక్వా, టెక్స్‌టైల్ గార్మెంట్స్, పట్టు, డైరీ, ఉద్యాన, వంటి రంగాలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని వివరించారు. ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంట బయట, ఉపాధి అవకాశాలు దెబ్బతిని విద్యార్థులు, యువత భవిష్యత్తు అగమ్య గోచరంగా మారుతోందన్నారు. ఇలాంటి సమయంలో మోడీ ట్రంప్ నిర్ణయాలను వ్యతిరేకించకుండా ఆయన అడుగులకు మడుగులొత్తేలా వ్యవహరించడం సరికాదన్నారు. అమెరికా సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలు కాపాడే వైఖరి తీసుకొనేలా ఒత్తిడి పెంచాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి, మండల కమిటీ సభ్యులు బాబావలి, నాగరాజు, నరసింహ, రాజురావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

కామ్రేడ్ టిఎన్.రసూల్ కన్నుమూత

పలువురి నివాళి

రసూల్ పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

టిఎన్.రసూల్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ రసూల్(75) శనివారం కన్నుమూశారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో ఆయన తుదిశ్వాస విడిచారు. రసూల్ సుదీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారు. రసూల్ అక్షరాస్యత ఉద్యమంలో కళాకారుడిగా పని చేశారు. అక్కడి నుంచి సిపిఎంలో చేరి పలు ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించారు. సిపిఎం నుంచి తరిమెల నాగిరెడ్డి విడిపోయిన తర్వాత పార్టీ పునర్నిర్మాణం కోసం అనేక ప్రయత్నాలు జరిగాయి. అప్పట్లో అనంతపురం పట్టణంలో ఏర్పడిన సిపిఎం శాఖలో రసూల్ సభ్యుడుగా ఉండి పని చేశారు. నగరంలో సిపిఎం కార్యకర్తాలకు ఆయన సైకిల్ షాపు కేంద్రంగా ఉండేది. మోటారు వర్కర్స్ యూనియన్, కందుకూరు ఎఫ్‌సిఐ హమాలీ యూనియన్ ఫర్మేషన్లో పార్టీని కాపాడుకోవడం కోసం రసూల్ మిలిటెంట్‌గా నిలిచారు. అక్షరాస్యత ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. పార్టీ తరుపున మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గానూ పోటీ చేశారు. పట్టణ కమిటీ సభ్యుడుగా, పూర్తి కాలం కార్యకర్తగా పనిచేశారు. ప్రస్తుత పార్టీ ఆఫీసు నిర్మాణానికి ముందు జరిగిన ఏర్పాట్లలో ఆయన కీలకంగా వ్యవహరించారు. అనంతపురంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన భూ స్వాధీన పోరాటంలో పాల్గొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో విశేష కృషి చేశారు. ప్రజా ఉద్యమం, పోరాటాల్లో భాగంగా ఆయన అనేక కేసులను ఎదుర్కొన్నారు. కేసులకు భయపడకుండా తను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగారు.

పలువురి నివాళి

రసూల్ మరణవార్త తెలుసుకున్న పలువురు ఆయన నివాసం వద్దకు వెళ్లి పార్థివదేహానికి నివాళులు అర్పించారు. రసూల్ మతదేహంపై సిపిఎం జెండాను కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ రసూల్ మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం ప్రజా ఉద్యమానికి తీరని లోటన్నారు. మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ పాటు డా॥ప్రసూన, డాక్టర్ వీరభద్రయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జి.ఓబులు, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి తదితరులు రసూల్ పోరాటాలను కొనియాడారు. సిపిఎం సీనియర్ నాయకులు శివారెడ్డి, గోనిరెడ్డిశ్వర, ముబారక్, ప్రకాష్, వెంకటనారాయణ, వలి, రాయుడు, రాజు, గఫూర్, చికెన్ నారాయణస్వామి, రామాంజి, రాముడు, బబ్లూ, జిలాన్, షెక్షావలి నివాళులు అర్పించారు.

విలువలతో కూడిన నాయకుడు ఓబులు

కామ్రేడ్ రసూల్ విలువలతో కూడిన కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి పని చేశారని సిపిఎం సీనియర్ నాయకుడు జి.ఓబులు తెలిపారు. పేదల కోసం ప్రజా ఆందోళనలు నిర్వహించి వారికి అండగా నిలిచారన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాటం నిర్వహించి అనేకమంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారన్నారురర. ప్రజా ఉద్యమాలలో రసూల్ ఎన్నో కేసులను ఎదుర్కొన్నారని, అయినా వెనుకడుగు వేయకుండా ప్రజా ఉద్యమాన్ని నిబద్ధతతో ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు.

6 నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

సూపరింటెండెంట్ విజయ్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

విజయ్ కుమార్

జాతీయ తపాలా వారోత్సవాలను ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు హిందూపురం తపాలా డివిజన్ కార్యాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతమైన ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను అందించడానికి అక్టోబర్ 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు డివిజన్ వ్యాప్తంగా ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయం, కదిరి ఉప తపాలా కార్యాలయం, బుదిలి ఉపతపాలా కార్యాలయం, ధర్మవరం ప్రధాన తపాలా కార్యాలయం, ధర్మవరం ఆర్ఎస్ తపాలా కార్యాలయం, ప్రశాంతినిలయం ఉప తపాలా కార్యాలయాల్లో ఈ క్యాంపులు కొనసాగుతాయన్నారు. వీటితో పాటు నిర్దేశించిన పాఠశాలలు, నివాస కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలతో సహా ఎంపిక చేసిన ప్రజా ప్రదేశాల్లోనూ ఈకార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. హిందూపురం డివిజన్‌లోని లోటస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పులకుంట, హిందూపురం, లోటస్ పబ్లిక్ స్కూల్ కొట్టకుంట, ఎలీజబెత్ పబ్లిక్ స్కూల్ కిరికెరలో మొబైల్ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమంలో పౌరులందరికీ ఆధార్ నమోదు, జనాభా సంబంధిత, బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆధార్ నమోదు సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌లను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. 7 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం చేసే తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ -1 లకు, అప్‌డేట్ సంబంధిత రుసుంకు ఈ నెల 10వ తేదీ మినహాయింపు ఉంటుందన్నారు. తపాలా శాఖ ఆర్థిక చేరికను ప్రోత్సహించేందుకు తపాలా కార్యాలయం పొదుపు బ్యాంకు ఖాతాలు, పది సంవత్సరాల్లోపు ఆడపిల్లల కోసం సుకన్య సంవృద్ధి యోజన ఖాతాలు, మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రొవిడెంట్ ఫండ్ ఖాతాలను తెరుచుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్టు చెప్పారు.

యూరియా కోసం వేచి ఉన్న రైతులు

యూరియా కోసం తప్పని నిరీక్షణ

పంపిణీ కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

ప్రజాశక్తి-రొద్దం

రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. రొద్దం సొసైటీ వద్ద యూరియా కోసం శనివారం రైతులు పెద్ద సంఖ్యలో క్యూలైన్లో నిల్చున్నారు. రొద్దం సొసైటీకి 260 పాకెట్ల యూరియా వాటిని శనివారం పంపిణీ చేపట్టారు. యూరియా ఇస్తున్నారన్న విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో సొసైటీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. క్యూలైన్లో నిల్చున్న వారికి ఒక్కొక్కరికి 2 ప్యాకెట్ల యూరియాను అందించారు. కలిపి సొసైటీ పరిధిలోనూ ఎల్‌జిబి.నగర్ వద్ద యూరియా పంపిణీ చేశారు. రైతులకు సరిపడా యూరియా రాకపోవడంతో గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సి పరిస్థితి నెలకొంది. పంట సాగు సమయంలో యూరియా లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పంటకు సరపడా యూరియా అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు నాయక్

ఖైదీలు కారాగారాల నుంచి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న రిమాండ్ ఖైదీలు, ఎప్పటినుండి కారాగారంలో ఉంటున్నారు, ఎలాంటి తప్పులు చేసి జైలుకు వచ్చారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా, ప్రతివారం వైద్య సేవలను నిర్వహిస్తున్నారా, జైలు సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారా అన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి జైలుకొచ్చిన వారు బయటకు వెళ్లిన తర్వాత మంచిగా జీవనం సాగించాలన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను నేరుగా అధికారుల దష్టికి తీసుకురావాలన్న ఉద్దేశంతోనే ఫిర్యాదులు పెట్టెను ఏర్పాటు చేశామని, ఇందులో ఏవైన సమస్యలుంటే తెలియజేయాలన్నారు. అర్హత ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కాగా సబ్‌జైలుకు వైద్యులు పరీక్షల నిమిత్తం రావడం లేదని తెలుసుకున్న న్యాయమూర్తి వెంటనే లిఖిత పూర్వకంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగారాధికారి హనుమప్ప, న్యాయవాది నవేరా, లోక అదాలత్ సిబ్బంది హేమావతి, రాజు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా ఎంపి బికె.పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ఎంపి మాట్లాడుతూ దళితులు అన్ని విధాలా అభివృద్ధి చెందినప్పుడే అంబేద్కర్ ఆశయాలు నెరవేరుతాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే మనం ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నామన్నారు. చదువు ఒక్కటే అన్ని అవకాశాలు కల్పిస్తుందని, ఉన్నత స్థానాలకు చేర్చుతుందని, కావున దళితులందరూ తమ పిల్లలను చదువుల వైపు మళ్లించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పవన్ కుమార్‌రెడ్డి, బంగారు కృష్ణమూర్తి, రాజశేఖర్‌బాబు, టిడిపి మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, కావడి ప్రవీణ్‌కుమార్, సోంపాల్యం నాగభూషణ, రమణయ్య, నరసింహులు, భావన్న, నారాయణ, దళిత, ఎమ్మార్పీఎస్, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అందులో భాగంగా వైద్యులు గోవర్ధన్ రెడ్డి 70 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో కంటి శుక్లాల సమస్య ఉన్న 25 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. ఎంపికైన వారికి కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్, రోటరీ సభ్యులు ఓబులకొండయ్య, నాగన్న పాల్గొన్నారు.

బోధనలో విషయ పరిజ్ఞానం ముఖ్యం

ఉప విద్యాశాఖ అధికారి రెడ్డప్ప

శిక్షణలో మాట్లాడుతున్న డివైఈఓ రెడ్డప్ప

ప్రజాశక్తి-హిందూపురం

సమాజంలో ఉపాధ్యాయ వత్తికి ఎంతో గౌరవం ఉందని, ఆ వత్తి లభించడం గర్వకారణమని పెనుకొండ డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి రెడ్డప్ప పేర్కొన్నారు. 2025 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి హిందూపురం బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శిక్షణ తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఎంతో పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరబోతున్న అందరూ బాధ్యతాయుతంగా, అంకిత భావంతో పనిచేయాలన్నారు. విద్యాభివృద్ధితో పాటు సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని సూచించారు. విద్యార్థులతో మమేకమవుతూ బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కార్య నిర్వహణ జిల్లా అధికారి మాలిక్, మండల విద్యాశాఖ అధికారులు శేషాచలం, గంగప్ప, ప్రసన్న లక్ష్మి, డైట్ పరిశీలకులు ప్రభాకర్, ఆదర్శ్, భారత్ విద్యా సొసైటీ ప్రతినిధి డాక్టర్ శ్రీనివాస రెడ్డి, ఎస్ఆర్‌పి బాబా, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

7న చలో విజయవాడ : ఫ్యాప్టో

సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 7వ తేదీ విజయవాడ ధర్నా చౌక్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో ఛైర్మన్ గజ్జల హరిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లాలో శనివారం ధర్నా పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఫ్యాప్టో ఛైర్మన్ గజ్జల హరిప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ గౌస్ లాజం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వంలో భాగస్వాములైన ఉద్యోగుల బాగోగులు చూడాల్సిన బాధ్యత, చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు బడా హరిప్రసాద్ రెడ్డి, షామీవుల్లా మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగ సంఘాలతో చర్చించి విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కారించాలని లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జవహర్, ఆంజనేయులు, రమేష్, ఆదిబయన్న, రాజశేఖర్, నారాయణ, తాహిర్‌వలి, హనీఫ్‌ఖాన్, భార్గవ్, వెంకటేష్ బాబు, చాంద్‌బాషా, అంజన్ రెడ్డి, షర్ఫుద్దీన్, మౌలాలి, వెంకట చలమయ్య, హతావుల్లా ఈదుల్లా, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, రామ చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడీవేడిగా పుట్టపర్తి కౌన్సిల్ మీట్

ప్రొటోకాల్ పాటించకపోవడంపై అధికారులపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'బిల్లులు పాస్ కావాలంటే కౌన్సిలర్లు అవసరం కానీ ప్రొటోకాల్ పాటించరా'?.. అధికారులు మాకు మర్యాద ఇవ్వరా?.. అంటూ కౌన్సిల్ సమావేశంలో ఛైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ మాతంగి తిప్పన్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఛైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రారంభంలోనే ఛైర్మన్, వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ మేము వైసిపి కాబట్టి ప్రొటోకాల్ పాటించడడం లేదని, ఏ విషయంపైనా సమాచారం ఇవ్వడం లేదని అధికారులపై మండిపడ్డారు. దీంతో సమావేశం కాసేపు రసాభాసగా మారింది. టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి మాట్లాడుతూ మర్యాద ఇవ్వనప్పుడు గద్దె దిగడం శ్రేయస్కరం అని సలహా ఇచ్చారు. స్పందించిన వారు మేము నిన్ను అడగలేదని, అధికారులను అడుగుతున్నామని, మెజార్టీ ఉన్న మేమెందుకు గద్దె దిగుతామని ప్రశ్నించారు. కౌన్సిలర్ సూర్యగౌడ్ మాట్లాడుతూ 2020లో మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉండేదని ఇప్పుడు అట్టడుగులో ఉండడం సిగ్గుచేటు అన్నారు. కమిషనర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ గతంలో ఏమి జరిగిందో తనకు తెలియదని ఇప్పటినుంచి ప్రొటోకాల్ పాటిస్తామని తెలిపారు. అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 20 వార్డులు ఉన్న మున్సిపాలిటీని 27 వార్డులుగా విభజించామని, అభ్యంతరాలు ఉంటే తెలుపవచ్చు అన్నారు. ఆదివారం కూడా అభ్యంతరాలు, సలహాలు స్వీకరిస్తామని తెలిపారు. కౌన్సిలర్ చెరువు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ నర్సింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్‌లో ఓపెన్ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నవంబర్ 8, 9 తేదీల్లో తెలుగు రాష్ట్రాల ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నీ ఆర్గనైజింగ్ డైరెక్టర్ ఈశ్వరప్ప తెలిపారు. పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీ ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం ఆయన చెస్ టోర్నీ వివరాలు వెల్లడించారు. యువర్స్ ఫౌండేషన్, హాయ్ బ్రో చెస్ అకాడమీ అనంతపురం వారి ఆధ్వర్యంలో చెస్ టోర్నీ నిర్వహిస్తున్నామని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతకు రూ. 8వేలు, రన్నర్స్‌కు రూ. 6000, ఆ తర్వాతి స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ. 4వేలు, రూ. 3వేలు, రూ. 2వేలు నగదు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ప్రవేశ రుసుము రూ. 600 చెల్లించి నవంబర్ 8వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టోర్నీ హానరబుల్ ప్రెసిడెంట్ డాక్టర్ బివి.సుబ్బారావు, ఆర్గనైజింగ్ అధ్యక్షులు చాంద్‌బాషా, సెక్రటరీ జాకీర్ హుస్సేన్, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, వైకె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

6న వాల్మీకి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలో వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణలో భాగంగా శనివారం వాల్మీకి సామాజిక వర్గం ఆధ్వర్యంలో పెన్నానదిలో గంగపూజ కార్యక్రమం నిర్వశించారు. అనంతరం అక్కడి నుంచి కళశాలలో గంగను తీసుకొచ్చి స్థానిక పంచాయితీ కార్యాలయం పక్కన ఉన్న వాల్మీకి విగ్రహానికి కుంభాభిషేకం చేశారు. ఈ నెల 6వ తేదీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వాల్మీకులు హాజరై జయప్రదం చేయాలని వాల్మీకి మహర్షి సంఘం సభ్యులు కోరారు. కార్యక్రమంలో అర్చకులు గిరీష్‌స్వామి, వాల్మీకి కులస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని కునుతూరు గ్రామ ఆర్‌డిటి స్కూల్‌లో శనివారం రూరల్ సిఐ ప్రభాకర్ గౌడ్, ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని, చిన్నపిల్లలపై నిఘా ఉంచి వారిపై జరిగే నేరాలను అరికట్టాలని, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. మట్కా, పేకాట, జూదం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, మద్యానికి బానిస కాకూడదని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు, గ్రామ విఆర్ఒ, ప్రజలు పాల్గొన్నారు.

పాత్రికేయులకు నిత్యావసరాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. టిడిపి మండల మైనారిటీ అధ్యక్షుడు ఎ.షబ్బీర్, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీరామప్ప, సీనియర్ పత్రికేయులు సన్నలింగప్ప విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా మండలంలోని పాత్రికేయులకు బియ్యం, కందిపప్పు, మంచి నూనె, గోధుమపిండి, బెల్లం, తదితర నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బి.నాగరాజు, రంగనాథ్, శ్రీధర్, రాజ్‌కుమార్, ఎస్‌హెచ్.రాయుడు, రంగధామప్ప, రాయుడు, తిప్పేస్వామి, పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు 'కూటమి' అండ

'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభోత్సవంలో ఎంపి, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు

కదిరిలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఎంపి బికె.పార్థసా రథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించిందన్నారు. వారు శనివారం పట్టణంలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించారు. ఎన్నికల్లో మాట ఇవ్వకపోయినా బ్యాంకు ఖాతాలో రూ. 15వేలు జమ చేయడం పట్ల ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పట్టణంలో ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ చేపట్టారు. ఎంపి, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా అరాచక పాలన సాగించి అన్ని వర్గాల ప్రజలను భయాందోళనలకు గురి చేశారని విమర్శించారు. జగన్ ఐదేళ్ల పాలనలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ప్రజలు జగన్‌ను ఎట్టి పరిస్థితుల్లో నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైసిపికి కాలం చెల్లిందని ప్రజలు ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పక్కగా అమలు చేస్తుందని, ఇవ్వని హామీని నెరవేర్చిందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్‌ఉన్నీసా, కౌన్సిలర్లు, టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు స్థాయిలో సంక్షేమం : ఎమ్మెల్యే రాజు

మడకశిరలో ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్ : కూటమి ప్రభుత్వం 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ద్వారా గత ప్రభుత్వం కంటే రెట్టింపు స్థాయిలో సంక్షేమం అందిస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. గత ప్రభుత్వంలో వాహన మిత్రకు రూ. 200 కోట్లు కేటాయిస్తే ఈ ప్రభుత్వం రూ. 435 కోట్లు కేటాయించిందన్నారు. 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం ప్రారంభం సందర్భంగా శనివారం పట్టణంలో ఆటో డ్రైవర్లు ఆటోలతో పెద్దఎత్తున ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే రాజు ఆటో నడిపి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ ర్యాలీ స్థానిక ప్రభుత్వ జూని యర్ కళాశాల మైదానం నుంచి ప్రధాన రహదారుల గుండా మధుగిరి రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకూ నిర్వహించారు. అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి అర్హులైన ఆటో డ్రైవర్లందరికీ ఇస్తామన్నారు. ఈ నెల 6వ తేదీ మన ఊరు చెరువులో జల హారతి ఇస్తున్నామన్నారు. అమరాపురం చెరువుకు కృష్ణా జలాలు అందించి అక్కడ సిఎం చంద్రబాబు జలహారతి ఇస్తారని తెలిపారు. ఆటో డ్రైవర్లందరికీ ప్రమాద బీమా ప్రీమియం రూ. 380 చొప్పున సొంత నిధులతో చెల్లిస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా నియోజకవర్గంలో 235 మందికి రూ. 35.25 లక్షలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వాతి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గురుమూర్తి, టిడిపి మండల కన్వీనర్ నాగరాజు, మున్సిపల్ ఛైర్మన్ నరసింహరాజు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : పురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్

హిందూపురం : ఆటో డ్రైవర్లకు రూ. 15,000 ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని రహమత్ పురం సర్కిల్ నుంచి ఆర్‌టిఒ కార్యాలయం వరకు చేపట్టిన ఆటో ర్యాలీని టిడిపి నాయకులతో కలిసి ఛైర్మన్ రమేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు టిడిపి జిల్లా అధ్యక్షులు అంజినప్ప, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్‌లు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఎం చంద్రబాబు, బాలకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పట్టణంలో 908 మంది ఆటో డ్రైవర్లకు రూ.1.36 కోట్లు వారి ఖాతల్లో జమ చేసినట్లు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డేఅంజనప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి బాలాజీ, పట్టణ అధ్యక్షులు వెంకటేష్, రూరల్ లేపాక్షి, చిలమత్తూరు మండల కన్వీనర్‌లు రాము, అభిషేక్, శ్రీనివాసులు, సీనియర్ నాయకులు నాగరాజు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్లలో హర్షం : ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు

పెనుకొండ : 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకంతో డ్రైవర్ల కళ్లలో ఆనందం కనిపిస్తోందని కడప ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల ఖాతాల్లో రూ.



పెనుకొండలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ నాగరాజు

15వేల చొప్పున డబ్బులు జమ చేసిన సందర్భంగా పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి వద్ద నుంచి జూనియర్ కళాశాల వరకూ సంఘీ భావంగా ఆటో డ్రైవర్లు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సందేశాన్ని వినిపించారు. పూల నాగరాజు, సగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకట రమణ, ఆర్డీఓలు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 761 మందికి రూ. 1,14,15,000 లబ్ధి చేకూరిందని వివరించారు. ప్రభుత్వం రవాణా రంగం అభివృద్ధికి చేస్తున్న ప్రయత్నంలో భాగమే ఈ పథకం అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్లకు మెగా చెక్కు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ నర్సింహప్ప, ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, డిడిఒ రామకృష్ణయ్య, కురుబ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్లు శ్రీనివాసులు, కేశవయ్య, టిడిపి పట్టణ, మండల కన్వీనర్లు శ్రీరాములుయాదవ్, దండు ఈశ్వరప్రసాద్, నాయకులు చిన్నప్పయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ప్రభుత్వ ం చేయూత

ధర్మవరం రూరల్ : ఆటో డ్రైవర్ల కష్టాల నుంచి పుట్టిందే 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం అని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి

పురంలో కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

పరిటాల శ్రీరామ్ తెలిపారు. కూటమి ముఖ్యనాయకులు, అధికారులు శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. మొత్తం 1,130 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 1.69 కోట్లు జమ చేశారు. మార్కెట్ యార్డ్ నుంచి టిడిపి, బిజెపి, జనసేనపార్టీల ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో ఆటో డ్రైవర్ల కష్టాలను గుర్తించిన నారా లోకేష్ ఈ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. దీని ద్వారా ఎంతో కొంత వారికి ఊరట లభిస్తుందన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మహేష్, ఎంవిఐ రాణి, మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణ, పిఆర్‌ఒ విజయభాస్కర్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సంధిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు శేఖర్, నాయకులు హరీష్, ఆటో డ్రైవర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

నల్లమాడ : నల్లమాడ క్రాస్‌లో టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, ఎల్ఐసి నరసింహులు ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి ఆటో డ్రైవర్లు, టిడిపి శ్రేణులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్లో మంజూరెడ్డి, రవీంద్ర, ఆటో యూనియన్ అధ్యక్షులు కేశవులు, నరసింహులు, డి.హనుమంత్‌రెడ్డి, అగ్గిరాముడు, ఎం.రవికుమార్, ఎస్.కేశవరెడ్డి, ఆటో డ్రైవర్లు కేశవ, ప్రేమలతారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్మవరంలో ఆటో డ్రైవర్లకు చెక్కు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్, చిలకం

బైక్‌లు ఢీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో తండ్రి మృతి చెందగా కొడుకు గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిమర్రి మండలంలోని పుల్లంపల్లి గ్రామానికి చెందిన గోనుగుంట్ల రాజశేఖర్ తండ్రి గోనుగుంట్ల చింతలరాయుడుతో కలిసి శుక్రవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బత్తలపల్లికి బయల్దేరారు. వారు మండలంలోని వెంకటగారిపల్లి గ్రామ క్రాస్ వద్ద వెళ్తుండగా ముందు వెళ్తున్న తాడిమర్రి మండలంలోని పుల్లనారాయణపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డి ఉన్నఫళంగా తన ద్విచక్ర వాహనాన్ని కుడి వైపు తిప్పడంతో రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో చింతల రాయుడు, రాజశేఖర్ గాయపడ్డారు. వారిని స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం చింతలరాయుడు పరిస్థితి విషమించడంతో అనంతపురం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంద ఎద్దులు గోశాలకు తరలింపు

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో అక్రమ పశువుల రవాణాను భగ్నం చేసి ముగ్గురిపై కేసు నమోదు చేయడంతో పాటు 100 ఎద్దులను గోశాలకు తరలించినట్లు వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు తెలిపారు. కర్నాటక రాష్ట్రం మధుగిరి నుంచి పశువులను తరలిస్తున్నట్లు శుక్రవారం అర్ధరాత్రి ఒక వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు. పరిగి రోడ్డులో ఉన్న కబేలాలను పరిశీలించగా వధించడానికి సిద్ధంగా ఉన్న ఎద్దులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎద్దుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

'సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్' ర్యాలీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన జిఎస్‌టి సంస్కరణల వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉందనిఎంపి బికె.పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. జిఎస్‌టి–2.0 సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను వ్యాపార వర్గాలు, ప్రజలకు వివరించడంలో భాగంగా శనివారం పట్టణంలో 'సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్' విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి, ఎమ్మెల్యే జిఎస్‌టి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చడంతో పాటు అదనంగా ప్రజలకు ప్రయోజనాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేపట్టిన జిఎస్‌టి సంస్కరణలు సామాన్యులను సైతం ఆర్థికంగా బలోపేతం చేయడానికి పునాదిలా ఉపయోగపడతాయన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టడమే కాకుండా అప్పుల రాష్ట్రంగా మార్చిందన్నారు. ఆర్థిక సంక్షోభం ఉన్నా సిఎం చంద్రబాబు ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. విజయోత్సవ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజల భారీగా పాల్గొన్నారు.

కదిరిలో జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ ర్యాలీలో పాల్గొన్న ఎంపి, ఎమ్మెల్యే

జిఎస్‌టి సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు

ధర్మవరం రూరల్ : జిఎస్‌టి–2.0 సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలపై మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో 'జిఎస్‌టి సూపర్ సేవింగ్స్'పై అవగాహనా సదస్సు నిర్వహించారు. జిఎం డిఐసి నాగరాజు, జిఎస్‌టి అధికారి మెరువ చందు, రమేష్ రెడ్డి హాజరై జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. జిఎస్‌టిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత కుళ్లాయప్ప, అంజనప్ప, తిరుపాల్, బాబురావు, జ్యోతి, మురళీమోహన్, ప్రజలు పాల్గొన్నారు.

పల్లెను కలిసిన లక్ష్మీనారాయణ

పల్లెకు శ్రీకాళహస్తి పాలకమండలి సభ్యుని సన్మానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా కొత్తచెరువుకు చెందిన మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన శనివారం మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తన ఎంపికకు కృషి చేసిన పల్లెకు లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సందీప్, మురళి, వెంకటేష్, చంద్ర ,తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-పెనుకొండ

చిత్తూరు జిల్లాలో భారతరత్న బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సమాన హక్కులు, జీవించే హక్కులను భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల ద్వారా కల్పించిన మహనీయులు అంబేద్కర్ అన్నారు. అలాంటి మహనీయులకు ఈ సమాజం ఇచ్చే గౌరవం ఇదేనా అని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు ఈ సంఘటనపై నోరు తెరవకపోవడం దురదృష్టకరం అన్నారు. ఈ సంఘటనకు కారకుడైన సతీష్‌నాయుడుని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షులు వెంకటేశులు, బాబుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమర్, నరసింహులు, కదిరప్ప, ఈశ్వర్, రామాంజనేయులు, గంగాధర్, ఆంద్రూస్, అంజనప్ప, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2 లక్షల వితరణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం గాంధీ సర్కిల్‌లో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శాశ్వత సభ్యత్వం కింద రూ.2,01,116 వితరణ చేశారు. ఈ మేరకు శనివారం ఆలయ నిర్మాణం కోసం విశ్రాంత ఉద్యోగి సత్యనారాయణ, లక్ష్మి ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, నిమ్మకాయల రాము తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్య కోర్సులపై అవగాహన

గోరంట్ల : దసరా పండుగ సెలవుల్లో మండలంలోని బూదిలి జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర శిక్షణలో భాగంగా పట్టణంలోని మదీనా గిఫ్ట్ స్టోర్, పాల డైరీలు, వస్త్రాల దుకాణాల్లో రిటైల్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పించినట్లు హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వృత్తి నైపుణ్యాల గురించి పిఎంశ్రీ ఒకేషనల్ ట్రైనర్ ప్రమీల విద్యార్థులకు వివరించారు.

మారువేషంలో ఆసుపత్రికి వెళ్లిన ఎమ్మెల్యే రాజు

ఆసుపత్రిలో మారువేశంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర టౌన్

ప్రజాప్రతినిధిగా ప్రజాసేవలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు రూటే సెపరేటు అని మరోసారి నిరూపించుకున్నారు. ఆయన శనివారం తలకు క్యాప్, ముఖానికి మాస్క్ ధరించి మారువేషంలో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగుల సమస్యలు, వైద్య చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు మారువేషంలో వచ్చిన వ్యక్తి ఎమ్మెల్యే రాజు అని తెలిసి వైద్యులు, సిబ్బంది, రోగులు అవాక్కయ్యారు. ఎమ్మెల్యే చిత్తశుద్ధిని ప్రజలు ప్రశంశించారు.

పత్తి చంద్రశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్‌ను శనివారం జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. పత్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ నీటిపారుదల రంగంలో తన వంతు సహకారం అందించి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తామన్నారు. ఈ పదవి రావడానికి కారకులైన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ జనసేన ప్రధాన కార్యదర్శి రాము, ముత్యాల కరుణాకర్, నాయకులు పాల్గొన్నారు.



పత్తి చంద్రశేఖర్‌ను శాలువాలతో సన్మానించిన జనసేన నాయకులు

పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత సూచించారు. మండలంలోని పెడపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ, బేటీ బచావో – బేటీ పడావో, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ పోషకాహారం ప్రాముఖ్యత, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, చిరుధాన్యాలు, పోషక విలువల గురించి వివరించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు పెంచి అందంగా తీర్చిదిద్దాలన్నారు. గర్భిణి అని తెలిసినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకూ ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, జాగ్రత్తలు, ఆరోగ్య పరీక్షలు, వ్యాధినిరోధక టీకాల గురించి వివరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, భగవతి, అనిత, రేణుక, అరుణ, ఆయాలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఐసిడిఎస్ సిడిపిఒ సరస్వతి

బత్తలపల్లిలో పోషకాహారంపై వివరిస్తున్న సిపిపిఒ సరస్వతి

పిలుపునిచ్చారు. మండలంలోని మాల్యవంతం గ్రామ 1వ అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ ఎర్రమ్మ అధ్యక్షతన పోషణ్ మా వేడుక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఒ పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణ గురించి వివరించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక అంగన్వాడీ కేంద్రం–3లో ఐసిడిఎస్ సుపర్‌వైజర్ చంద్రమ్మ ఆధ్వర్యంలో 'పోషణ్ మా వేడుక' కార్యక్రమం నిర్వహించారు. చంద్రమ్మ మాట్లాడుతూ పోషక విలువలు ఎక్కువగా వుండే కూరగాయలు, ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌పి కుంట మండల సమావేశం రసాభాస

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి రాము అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ముందుగా పెద్దపల్లి ఎంపిటిసి సభ్యురాలు సరస్వతమ్మ మాట్లాడుతూ గతంలో సర్వేయర్లు భూముల హద్దులు పేర్లతో రైతుల నుంచి వేలాది రూపాయలు దండుకున్నారని పేర్కొన్నారు. ఆ భూములను ప్రస్తుతం సోలార్ ప్లాంట్‌కు కేటాయించడంతో షిరిడి సాయి కంపెనీ ఆధ్వర్యంలో సాగు భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు. రైతులను కనీసం సాగుదారులుగా కూడా గుర్తించకుండా మోసం చేశారని ఆవేద వ్యక్తం చేశారు. స్పందించిన తహశీల్దార్ దేవేందర్‌నాయక్ రైతులను సాగుదారులుగా గుర్తించి వారికి న్యాయం చేస్తామని సూచించారు. మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పిఎం కిసాన్ నిధులు జమ కాని రైతులు సంబంధిత సచివాలయ పరిధిలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ పార్థసారథి, ఈవోఆర్‌డి మాధవరెడ్డి, సీసీ బాబ్‌జాన్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిస్టరీ కేసు ఛేదింపు.. ముగ్గురు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-కదిరి టౌన్

2023లో చోటుచేసుకున్న ఓ మిస్టరీ కేసును ఛేదించి, ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. కదిరి రూరల్ సిఐ కార్యాలయంలో శనివారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన షేక్‌దాదాపీర్, తంగేడుకుంట అమరనాథ్ స్నేహితులు. దాదాపీర్ ఇంట్లో లేని సమయంలో అమరనాథ్ వారి ఇంటికొచ్చి దాదాపీర్ భార్యను లైంగికంగా వేధించే వాడు. ఈ విషయం భార్య దాదాపీర్‌కు తెలిపింది. దీన్ని జీర్ణించుకోలేని దాదాపీర్ అమరనాథ్‌పై కక్ష పెంచుకొని తన మిత్రులు కదిరి పట్టణానికి చెందిన పటాన్ మహమ్మద్ యాసీన్, నల్లచెరువు మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన పటాన్ సాధిక్‌బాషాతో కలిసి హత్యకు కుట్ర పన్నారు. ఆ మేరకు 2023 జూన్ 10వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఆటోలో అమరనాథ్‌ను కలిసి కదిరి రూరల్ మండలం బాలప్పగారిపల్లి సమీపంలోని ఓ గుట్ట వద్దకు తీసుకెళ్లి రాళ్లతో కొట్టి హత్య చేశారు. మృతదేహాన్ని సొంత ఆటోలో తీసుకెళ్లి కాళ్లు, చేతులు తాడుతో కట్టి నడుముకు బండరాళ్లు కట్టి చెర్లోపల్లి డ్యాంలో పడేశారు. అమరనాథ్ కనిపించకుండా పోవడంతో అప్పట్లో నల్లచెరువు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. నూతన ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, నల్లచెరువు ఎస్ఐ, వారి సిబ్బంది ఈ కేసులో సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో దాదాపీర్‌ను అనుమానితుడిగా భావించి విచారించగా నేరాన్ని అంగీకరించారని తెలిపారు. అమరనాథ్‌ను హత్యచేసిన ముగ్గురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు ఆటోను స్వాధీనం చేసున్నామన్నారు. కదిరి ప్రాంతంలో జరిగిన పాత నేరాలన్నింటిని ఎస్పీ సహకారంతో త్వరలోనే ఛేదిస్తామని తెలిపారు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

దసరా సందడేది.!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దసర వచ్చిందయ్యా.. సరద తెచ్చిందయ్యా అని చెప్పుకునే వారు. ఇప్పుడు పరిస్థితి వేరే విధంగా ఉంది. ఈ ఏడాది దసరా వచ్చింది కాని సంబరాలు తీసుకురాలేదు. పండుగ సందడి ఎక్కడా పెద్దగా కనిపించలేదు. మొక్కుబడిగానే ముగిసింది. ఒకవైపు అదును తప్పి వస్తున్న వర్షాలు, మరోవైపు ప్రభుత్వ తోడ్పాటు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న రైతాంగానికి కష్టాలు తప్పడం లేదు. ఈ వారంతో ఖరీఫ్ ముగిసింది. రబీ ఆరంభమవుతోంది. ఖరీఫ్‌లో లాగానే ఆరంభంలో వర్షాలు పడి ఇప్పుడు లేకుండాపోయాయి. ఇప్పుడు సెప్టెంబర్ ఆరంభంలో మంచి వర్షాలే వచ్చికనప్పటికీ ఆ తరువాత నుంచి తగ్గుతూ వస్తున్నాయి. ఇంకో వైపు ప్రభుత్వం కూడా పంటల సాగుపై ఏ మాత్రం దృష్టి సారించలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాల్లేక పోవడంతో సాగు భూమి పెద్ద ఎత్తున బీడుంది. ఆగస్టు ఆఖరులో పడిన మంచి వర్షాలకు ప్రత్యామ్నాయం అయినా ఇస్తారని రైతులు ఎదురుచూశారు. కాని ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఊసే లేకుండా ఈసారి ఎత్తేసింది. ఈ ప్రభావం ఖరీఫ్ సాగుపై స్పష్టంగా కనిపించింది. ఇక రబీలోనైనా సంసిద్ధంగా ఉందా అంటే అదీ లేకుండాపోయింది. మొన్నటి వరకు పడిన వర్షాలకు రబీలో పప్పుశనగ పంట అయినా సాగు చేసుకునే వారు. కాని ధర నిర్ణయం ఆలస్యంగా జరిగింది. ఇప్పుడు సేకరించి పంపిణీ ఇప్పటికీ

ఆరంభమవలేదు. మరోవైపు వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పుడు ఇస్తే విత్తనం విత్తుకునేందుకు అనువుగా ఉంటుందా.. లేదా..? అన్నది చూడాల్సి ఉంది. ప్రభుత్వం రైతాంగ సమస్యలపై పట్టించుకోవడం లేదన్న విపక్షాలు విమర్శలు చేస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ఇంకా చాలా మంది రైతులకు అన్నదాత సుఖీభవ సాయం ఖాతాల్లో పడలేదు. రాని వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. గతేడాది పంటనష్టానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇప్పటికీ రాలేదు. రెండు జిల్లాల నుంచి కూడా ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే ఎత్తడం లేదు. ఇక సాగునీటి రంగాన్ని ప్రభు త్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శ ఉంది. ఎందుకంటే ఇప్పటికీ జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించలేదు. ఒకవైపు జిల్లాకు పుష్కలంగా సాగునీరు వచ్చినా దాని వినియోగంపై నిర్ణయం జరగలేదు. నేతల ఒత్తిడి ఎటువైపు ఉంటే అటువైపు మళ్లిస్తున్నారన్న విమర్శలున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఆటో వాల సేవ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. శనివారం నాడు జిల్లా వ్యాప్తంగా ఈ పథకం కింద ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు పంపిణీ చేశారు. ఇక సిఐటియు అనంతపురం జిల్లా మహాసభలు గత వారంలో అనంతపురం నగరంలో జరిగాయి. జిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడంతోపాటు, వాటి పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించారు. రాబోయే మూడేళ్ల కాలంలో కార్మిక ఉద్యమాలపై చర్చించారు. నూతన కమిటీ ఎన్నికైంది. ఇక త్వరలో అనంతపురం నగరంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. వీటిని విజయవంతం చేయడానికి జిల్లా కమిటీ కృషి చేస్తోంది. ఇప్పటికే జిల్లా మహాసభలు పూర్తయి ఉన్నాయి. ఇక రాష్ట్ర మహాసభలను దిగ్విజయం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కూడా ఇప్పటికే ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

డ్యాకుమెంట్ మిస్సింగ్

శ్రీ సత్య జిల్లా హిందూపురం పట్టణంలోని డి బి కాలనీలో నివాసం ఉంటున్న హరీష్ బాబు అను నేను నా ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు డాక్యుమెంట్ నెంబర్ 904/1972 విక్రయ పత్రం పుట్ట రంగయ్య S/o రంగన్న, డాక్యుమెంట్ నెంబర్ 14 18/ 1955 విక్రయ పత్రం ఖాసీమ్ బి W/o పురాన్ సాబ్, డాక్యుమెంట్ నెంబర్ 82/1990 దాన పత్రం హాజరంబి W/o సయ్యద్ రసూల్ ఇంటి నెంబర్ 11-7-1 సి, కోట, హిందూపురం , డాక్యుమెంట్ నెంబర్ 7356 / 2023 దాన పత్రం హరీష్ బాబు S/o లేట్ నంజుండప్ప. ఈ ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు ఎక్కడో పోగొట్టుకొని పోయినది. పై కనిపించిన ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికినచో ఫోన్ నెంబర్ 8811880099 సంప్రదించి ఇస్తే వారికి తగిన బహుమతి ఇవ్వగలము.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : PENUKONDA
I.A.No. 374/2024 And I.A 375/2024 in A.S 7/2016

Between:
Pacha Chennappa S/o Late Pachha Ramappa Petlakuntapalli (V), Gorantla (M), Sri Sathya Sai (D) **...Petitioner/Appellant**
AND
Pachha Subbaiah and others **...Respondents**

NOTICE TO R8

To,
Pacha Ramadevi, W/o Late Pacha Narayanappa, Door No:4-1, Petlakuntapalli (V), H/o Kommavaripalli, Gorantla, Sri Sathya Sai(D).
ఇందుమూలముగా తెలియజేయడమేమనగా, పై దావాలో మీ హాజరు నిమిత్తమై 10-10-2025 వాయిదా వున్నది. కావున ఆరోజు మీరు ఖుద్దున కాని, వకీలు ద్వారా కాని పై కోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరు కావలను లేనిచో పై దావా మీ పరోక్షంగా తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
Sri L.VISWANATH,
Advocate, Penukonda

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : DHARMAVARAM
O.S 07/2024

Between:
Dandu Nagesam and Others **...Plaintiffs**
AND
Sarana Mallaiah & others **...Defendants**

NOTICE TO DEFENDANTS NO D2, D3 AND D13

D2: T.Mallaih S/o Venkata Subbaih Aged about 63 years,
D3: T.V. kalyan Kumar S/oT. Venkata Subbaih Aged about 42 years,
D13: JamaKayala Varadaih S/o Jamakayala Sallappa Aged about 50 years,
All are R/at Baddalapuram (V), Kanaganapalli (M), Sri Sathya Sai District.
పై కేసులో డిఫెండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం 23-10-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసియున్నారు. ఆ రోజు మీరు స్వతహగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ. K.C.చంద్రమౌళి,
అడ్వకేట్, ధర్మవరం
సెల్:9949339254

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : DHARMAVARAM
I.A.No. 29/2024 in O.S 07/2024

Between:
Dandu Nagesam and Others **...Petitioner/Plaintiffs**
AND
Sarana Mallaiah & others **...Respondents/Defendants**

NOTICE TO RESPONDENTS NO R2, R3 AND R13

R2: T.Mallaih S/o Venkata Subbaih Aged about 63 years,
R3: T.V. kalyan Kumar S/oT. Venkata Subbaih Aged about 42 years,
R13: JamaKayala Varadaih S/o Jamakayala Sallappa Aged about 50 years,
All are R/at Baddalapuram (V), Kanaganapalli (M), Sri Sathya Sai District.
పై కేసులో రెస్పాండెంట్స్/డిఫెండెంట్స్ అయిన మీ హాజరు నిమిత్తం 23-10-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసియున్నారు. ఆ రోజు మీరు స్వతహగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ. K.C.చంద్రమౌళి,
అడ్వకేట్, ధర్మవరం
సెల్:9949339254